క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం

సైదాపురం: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సైదాపురం సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. మండలంలోని కమ్మవారిపల్లి గ్రామం కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని చెప్పారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. కార్యకర్తలు లిఖిత తదితరులున్నారు.

విద్యార్థులకు నాస్ పరీక్షలు

డక్కిలి/నాయుడుపేట టౌన్ : డక్కిలి మండలంలోని డి.వడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలు, నాయుడుపేటలోని జెడ్పీ బాలురు, అంబేడ్కర్ బాలుర గురుకులం, రాజగోపాలపురం, జనరల్, నారాయణ, సెయింట్స్ మేరీస్, జాక్ అండ్ జిల్ పాఠశాలలు, పుదూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 3, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం నాస్ పరీక్షలు (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహించారు. ఈ పరీక్షలను ఎంఈవోలు కె.వెంకటేశ్వర్లు, మునిరత్నం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు రాసే నాస్ పరీక్షల వల్ల సబ్జెక్టుల వారిగా సామర్థ్యాలను తెలుసుకోవచ్చన్నా రు. ప్రతి విద్యార్థీ ఈ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే రానున్న రోజుల్లో ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గురుకులం ప్రిన్సిపాల్, డి.వడ్డిపల్లి హైస్కూల్ హెచ్ఎం అబీద్ పాల్గొన్నారు.

తమ లోగోతో అక్రమ వ్యాపారం

సైదాపురం: ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం చేస్తున్న తమ సంస్థ లోగోతో కొందరు అక్రమ వ్యాపారం చేస్తూ బురద చల్లేందుకు యత్నిస్తున్నారని యజమానులు తెలిపారు. మండలంలోని కలిచేడులో ఉన్న శ్రీకళ్యాణ రామ మైకా మైన్స్ లో బుధవారం వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే వీబీ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడారు. కలిచేడులో దశాబ్దాలుగా మైకా మైన్స్ నిర్వహిస్తున్న శ్రీకళ్యాణ రామ కంపెనీకి దేశ విదేశాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆరు నెలలుగా మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేశామన్నారు. కొంత మంది క్వార్జ్ ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేసుకుంటూ తమ సంస్థ లోగోను బ్యాగులపై ఉపయోగిస్తున్నారన్నారు. దానిపై తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎక్కడైనా సంస్థ లోగో బ్యాగుతో రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మైనింగ్ అక్రమాలపై చర్యలేవీ..?

గూడూరు రూరల్ : సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు పాదయాత్ర చేసిన నారా లోకేష్ మైనింగ్ అక్రమాలను అడ్డుకుంటామని చెప్పారని, నేడు అధికార పార్టీ నేతలే అక్రమంగా తవ్వకాలు చేపట్టి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

నెలాఖరు వరకు పంటల బీమా

వెంకటగిరి రూరల్/డొరవారిసత్రం : పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ నెలాఖరులోగా పంటల బీమాను నమోదు చేసుకోవాలని వెంకటగిరి, డొరవారిసత్రం ఏవోలు సుజాత, జ్యోతిర్మయి తెలిపారు. వారు బుధవారం వెంకటగిరి మండలం యాతలూరు, వల్లివేడు, డొరవారిసత్రం మండలం తనియాలి, ఉచ్చూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2024- 25 సంవత్సరానికి పంటల బీమాను నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంటకు రూ.650, వేరుశనగకు ఎకరాకు రూ.450 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. పశువైద్యాధికారి కిషోర్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పెళ్లకూరు/చిల్లకూరు/కలువాయి/వాకాడు: రెవెన్యూ సమస్యలపై శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పెళ్లకూరు, చిల్లకూరు, కలువాయి, వాకాడు తహసీల్దార్లు ద్వారకానాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్యామ్‌సుందర్‌రాజు, రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చడం, అసైన్డ్ భూముల ఖాతా నంబర్లకు ఆధార్ అనుసంధానం చేయడంతోపాటు భూ కబ్జాలు, సెక్షన్ 22 ఏ తారుమారు, ఇతర భూ సమస్యలన్నింటిపైనా ప్రజలు ఫిర్యాదుచేయవచ్చని వెల్లడించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

గూడూరు రూరల్ : అదృశ్యమైన గూడూరు పట్టణం వాలాయనందపురానికి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. సీఐ శేఖర్‌బాబు కథనం మేరకు వాలయానందపురం ప్రాంతానికి చెందిన క్రిష్ణయ్య కుమారుడు వెంకటనారాయణ (37) ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఈ నెల 2వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చిల్లకూ రు మండలం నాంచారమ్మపేట సమీపంలోని కాలనీ ఇళ్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో అతను అదృశ్యమైన వెంకటనారాయణగా తేలింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

నరకానికి నకళ్లు.. గ్రామీణ రోడ్లు

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- అడుగుకో గుంతతో అవస్థలు పడుతున్న వాహనదారులు

నాయుడుపేటలో పట్టణంలో అధ్వానంగా మారిన ట్రెజరి వీధి రోడ్డు



రోడ్లు బాగుంటే ఇతర ప్రాంతాలకు వస్తువుల రవాణా పెరిగి ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. అందుకే రోడ్లు ప్రగతికి సోపానాలు అని పెద్దలు చెబుతున్నారు. అసలే గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. దీనికితోడు ఫెంగల్ తుపాను ప్రభావంతో వారం రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో మరింత దెబ్బతిన్నాయి. గుంతల్లో నీరు నిలిచి అడుగు తీసి అడుగు వేయలేని స్థితికి చేరుకున్నాయి. కిలోమీటరు ప్రయాణానికి సుమారు 20 నిమిషాలకు పైగా పడుతోందంటే పరిస్థితి ఏమితో ఇట్టే అర్థం అవుతుంది. రోడ్ల గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సూళ్లూరుపేట/సూళ్లూరుపేట రూరల్/తడ/నాయుడుపేట టౌన్ /పెళ్లకూరు/ఓజిలి/చిల్లకూరు

- సూళ్లూరుపేట రూరల్ మండలంలోని ఇలుపూరు – తుంగమడుగు రోడ్డు కంకర లేచి పెద్ద గుంతలు పడ్డాయి. ఈ రోడ్డు గుండా 7 పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగిస్తారు.
- సూళ్లూరుపేట పట్టణంలోని హోలీ క్రాస్ సెంటర్ నుంచి శ్రీనగర్‌కాలనీ వరకు వున్న జీఎన్‌టీ రోడ్డు అధ్వానంగా తయారైంది. పాదచారులు కూడా నడిచి వెళ్లలేని స్థితి. కాలువలు పూడి పోవడంతో వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేక రోడ్డుపైనే నిలుస్తోంది. పట్టణంలోకి శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌ల్లోని పలు కంపెనీల బస్సులు, స్కూల్స్, కళాశాలలకు చెందిన బస్సుల తాకిడి ఎక్కువగా ఉండడంతో రోడ్డు మరింత దెబ్బతినింది.
- తడ మండలంలో అక్కంపేట నుంచి అండగుండాల మీదుగా చేనిగుంటకు వెళ్లే రింగ్ రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. అడుగుకో గుంత పడడంతో ద్విచక్ర వాహనం మీద వెళ్లాలంటే అంతే సంగతులు. అటకానితిప్ప నుంచి వేనాడుకు వెళ్లే 10.5 కిలోమీటర్ల రోడ్డు పెద్ద పెద్ద గుంతలలతో దారుణంగా మారింది.
- నాయుడుపేట పట్టణ పరిధిలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు, పాత ట్రెజరీ రోడ్డు గుంతల మయమయ్యాయి. విన్నమాల పంచాయతీ పరిధిలోని పెరికిలింపాటి కండ్రిగ, కమ్మవారిపాళెం రోడ్లు బురదతో అధ్వానంగా మారాయి. జువ్వలపాళెం పంచాయతీలోని కారుమంచివారి కండ్రిగ, చిగురుపాడు, భీమవరం, అరవపెరిమిడి, పూడేరు, పండ్లూరు, వెంగమాంబపురం, తదితర గ్రామాల రోడ్లలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి.
- పెళ్లకూరు మండలంలోని యడపూడి, కిష్టప్పకండ్రిగ, యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ, జూమానుగుంట, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు, పునబాక- చెంబేడు రోడ్లలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వాటిలో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది.
- ఓజిలి మండలంలోని ఓజిలి- కురుగొండ, ఓజిలి-గొల్లపల్లి, కోనేటిరాజుపాళెం-వజ్జవారిపాళెం రోడ్లలో గుంతలు పడ్డాయి. నెమళ్లపూడి-మనవాలి, పెద్దపరియ-రాచపాళెం రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అధిక లోడుతో వెళ్లే టిప్పర్లతో బట్లకనుపూర్ రోడ్డు గుంతలమయమైంది.
- గూడూరు మండలంలోని పురిటిపాళెంకు వెళ్ళే రహదారి కూడా వర్షం దెబ్బకు పూర్తిగా ధ్వంసమైంది.
- చిల్లకూరు మండలంలో తిక్కవరం, చింతవరం రోడ్డు పూర్తిగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. కోటకు వెళ్లే రోడ్డుపై అడుగుకో గుంత పడడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. విద్యానగర్ ప్రాంతంలో రోడ్లు దెబ్బతిన్నాయి.



దారుణంగా తయారై చెరువులను తలిపిస్తున్న సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డు



తడ మండలం అక్కంపేట - కారిపాకం- చేనిగుంటకు రోడ్డు దుస్థితి





నాయుడుపేట టౌన్ : బురదమయమైన కమ్మవారిపాళెం, పెరికిలింపాటి కండ్రిగ రోడ్లు







వర్షాలకు దెబ్బతిన్న పునబాక-చెంబేడు, జీలపాటూరు-దొడ్లవారిమిట్ట రోడ్లు

ఉపాధి నిధులతో షెడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

చిల్లకూరు/డొరవారిసత్రం/గూడూరు రూరల్ : ఉపాధి నిధులతో పాడి పశువులు, జీవాలు, కోళ్లకు అనుకూలంగా ఉండేలా షెడ్లు నిర్మిస్తున్నట్టు డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం పారిచెర్లవారిపాళెం గ్రామంలో ఉపాధి నిధులతో పాడి రైతులు నిర్మించుకుంటున్న షెడ్లను పరిశీలించారు. అదేవిధంగా ఆయన డొరవారిసత్రం, గూడూరు ఎంపీడీవో కార్యాలయాల్లో ఏపీఎంలు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గిన వెంటనే ప్రతి కుటుంబానికీ వంద రోజులు ఉపాధి పని దినాలు కల్పించాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. రైతులు పశువుల కోసం షెడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. షెడ్‌కు అయ్యే ఖర్చులో పాడి రైతులు 10 శాతం చెల్లించాలని, అలాగే జీవాల పెంపకం దారులు షెడ్ల నిర్మాణ ఖర్చులో 30 శాతం చెల్లించాలన్నారు. రెండు పశువులున్న రైతులకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులున్న వారికి రూ.2.30 లక్షలు మంజూరు చేస్తామన్నారు. జీవాల పెంపకందారులకు 20 జీవాలకు రూ.1.30 లక్షలు, 50 జీవాలకు రూ.2.30 లక్షలు, 100 కోళ్లున్న వారికి రూ.87 వేలు, 200 కోళ్లున్న రూ.1.32 లక్షలు మంజూరు చేస్తామని చెప్పారు. ఏపీడీ వరప్రసాద్, చిల్లకూరు ఉపాధి ఏపీవో గిరిబాబు, డొరవారిసత్రం వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, గూడూరు ఎంపీడీవో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

చిల్లకూరు : దివ్యాంగులని భయపడకుండా వారిలో చిన్నతనం నుంచి ఆత్మవిశ్వాసాన్ని నింపాలని ఎంపీడీవో గోపి సూచించారు. చిల్లకూరులోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలకు పోటీలు నిర్వహించారు. విజేతలకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు సహకారంతో బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఏదో ఒక అంశంపై మంచి పట్టు ఉంటుందని, దాన్ని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తే రాణిస్తారని వివరించారు. అలా కాకుండా నిరాశపరిస్తే వారిలో నైరాశ్యం పెరిగిపోయి పుట్టడమే తమ తప్పు అన్న భావనలోకి చేరుకుంటారని తెలిపారు. రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు విద్యకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని, ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. భవిత కేంద్రానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ వారు అందించిన రెండు వల్ చైర్‌లను ఇద్దరు పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సనత్‌కుమార్, ఎండీ రఫూప్, హెచ్ఎం శారద, భవిత ఉపాధ్యాయులు బొమ్మి నాగరాజు, లలిత, చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు బాబు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు వీల్ చైర్లు అందజేస్తున్న అధికారులు, ట్రస్టు ప్రతినిధులు

మగ్గం గుంతలను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు : వర్షాల కారణంగా నీరు చేరిన మగ్గం గుంతలను చేనేత, జౌళిశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. గుంతల్లోకి నీరు చేరి చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంపై సాక్షి దినపత్రికలో బుధవారం మగ్గం బతుకులు కుదేలు అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై చేనేత, జౌళి శాఖ క్లస్టర్ ఇన్‌చార్జ్ గౌతమ్ స్పందించారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లిలోని చేనేత మగ్గాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చేనేత, జౌళిశాఖ అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు మరికొంత మంది అధికారులు మగ్గాల గుంతలను గురువారం పరిశీలించి చేనేత కార్మికులతో మాట్లాడతారని తెలిపారు. తర్వాత నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.



మగ్గాల గుంతలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్న ఇన్‌చార్జ్ గౌతమ్

వ్యాపారులు ఆధార్ సీడింగ్ చేసుకోవాల్సిందే

నాయుడుపేట టౌన్ : ప్రభుత్వానికి జీఎస్‌టీ చెల్లించే వ్యాపారులు తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ చేసుకోవాలని గూడూరు జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ చల్లా అరుణకుమారి తెలిపారు. నాయుడుపేటలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో బుధవారం వ్యాపారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడు తూ వ్యాపారులు ఆధార్ సీడింగ్‌పై అపోహలు విడనాడాలన్నారు. రూ.40 లక్షల లావాదేవీలు దాటితే జీఎస్‌టీ పరిధిలోకి వస్తారని తెలిపారు. తమ తనిఖీల్లో లావాదేవీలు తప్పుగా చూపిస్తున్నట్టు తేలితే జరిమానా విధిస్తామన్నారు. వ్యాపారులు న్యాయబద్ధంగా వ్యవహరించి జీఎస్‌టీని చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాపార వాణిజ్య వర్తక సంఘం నాయకులు కరింబాయి చెంచయ్య, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దేవత శ్రీకర్, భూపతి శ్రీనివాసులు, కనమర్లపూడి సురేంద్ర, కామిరెడ్డి అమరేంద్రరెడ్డి, పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి

కోట: ఎన్‌సీసీతో యువకుల్లో దేశభక్తి పెంపొందుతుందని నావల్ యూనిట్ ఏఎన్‌వో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బుధవారం ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో భారత నావికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. నావల్ యూనిట్ ఏఎన్‌వో మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సైనిక శక్తిలో నావికాదళం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శివకుమార్ పాల్గొన్నారు.



నావికా దినోత్సవంలో ఎన్‌సీసీ నావల్ యూనిట్ క్యాడెట్లు

విషపు గుళికలు తిని యువకుడి ఆత్మహత్య

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు గిరిజన కాలనీకి చెందిన కడూరు సురేష్(17) బుధవారం చెంబేడులో విషపు గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. సురేష్ రెండు నెలలుగా చెంబేడులో మేనమామ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో అతను చెంబేడులోని మద్యం షాపు సమీపంలో అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు బంధువులకు సమాచారం అందించారు. సురేష్ చేతిలో గుళికలు ఉండడాన్ని గుర్తించి శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ–నలుగురికి గాయాలు

తిరుపతి స్విమ్స్‌కు చెందిన నలుగురు మహిళా జూనియర్ డాక్టర్లు బుధవారం రాత్రి నెల్లూరులో పెళ్లి వేడుకల్లో పాల్గొనేందుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో పెళ్లకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా వెళుతున్న కారును ప్రమాదవశాత్తు వీరి కారు ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు జూనియర్ డాక్టర్లకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సస్పెన్షన్లు రద్దు చేయాలి

గూడూరు రూరల్ : గూడూరు ఆర్టీసీ డిపోలో కార్మికుల అక్రమ సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యుల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ అక్రమంగా సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. రీజనల్ అధ్యక్షుడు మల్లికార్జున్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ఎ రాము, జీ ఎదర్, కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రితో విద్యార్థులు

గూడూరు రూరల్ : గూడూరులోని జీఎస్ఆర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు బుధవారం మ్యూజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని అందజేశారు. హెచ్ఎం సీహెచ్ మధుసూదన్ మాట్లాడుతూ మాండలేజ కంపెనీ(మ్యాజిక్ బస్సు) సామాజిక భద్రత కింద సేవా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ రూ.20 వేల విలువైన క్రీడా సామగ్రి అందజేసినట్టు తెలిపారు. సంస్థ కోచ్ ఆర్.లత మాట్లాడుతూ త్వరలో కబడ్డీ కోర్టు చదును చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రమణయ్య, హైమావతి, శ్రీదేవి, సుజన, భగవాన్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

కలువాయి: కిశోర బాలికలు సమాజంతోపాటు జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సఖి సెంటర్ అడ్మిన్ షహనాజ్ పిలుపునిచ్చారు. కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో సునంద ఆధ్వర్యంలో కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల్లో 11 నుంచి 18 ఏళ్లలోపు శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. సోషల్ మీడియా, సినిమాల ప్రభావం పడకుండా నిర్దిష్ట లక్ష్యాలవైపు వారిని నడిపించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రదర్శన ఏర్పాటు చేశారు.

బెల్టు దుకాణాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్..

వాకాడు/కోట : వాకాడు, కోట మండలాల్లోని బెల్టు షాపులపై బుధవారం వాకాడు ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. కోట మండలం గూడలికి చెందిన తోటకూర సునీతను అరెస్టు చేసి 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ప్రసాద్ తెలిపారు. గూడలి సంగమేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో బెల్టు షాపుల నిర్వహణపై బెల్టు షాపులు కట్టడి చేయాలి అన్న శీర్షికన సాక్షి దిన పత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనిపై వాకాడు ఎక్సైజ్ సీఐ స్పందించి దాడి చేశారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

వాకాడు : మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరాలపై బుధవారం వాకాడు పోలీసులు దాడులు చేశారు. కొండాపురంలో ఆరుగురిని అరెస్టు చేసి 2 కోళ్లు, రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ ఎన్నికలు

గూడూరు రూరల్ : రైల్వే యూనియన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. రెండు యూనియన్‌ల మధ్య గుర్తింపు కోసం జరుగుతున్న ఎన్నికలకు గూడూరు రైల్వే స్టేషన్‌లో పోలింగ్ చేపట్టారు. రెండు రోజులు జరిగే ఈ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంగ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ గుర్తింపు కోసం పోటీ పడుతున్నాయి. గూడూరు రైల్వే స్టేషన పరిధిలో 360 మంది ఓటర్లు ఉన్నారు. వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బుధ, గురువారాల్లో స్టేషన్లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జీఆర్‌పీఎఫ్ అధికారులు బందోబస్తు చేపట్టారు.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

మినీ వ్యాన్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రంలోని బ్రిడ్జిపై మంగళవారం రాత్రి మినీ వ్యాన్ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడి డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. డ్రైవర్ సుబ్రమణ్యం మినీ వ్యాన్ తీసుకుని నాయుడుపేట నుంచి సూళ్లూరుపేటకు బయలుదేరాడు. దొరవారిసత్రంలోని బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వ్యాన్ కింద ఇరుక్కుపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను రక్షించి 108లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.





ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ సుబ్రమణ్యం, వ్యాన్ కింద ఇరుక్కుపోయిన డ్రైవర్ సుబ్రమణ్యం

ఎడతెరపిలేని వర్షం.. ఇబ్బందుల్లో జనం



వెంకటగిరి రూరల్ : కలుజు పారుతున్న బసవాడి చెరువు

- కలుజులు పారుతున్న చెరువులు
- కట్టలు బలహీనంగా ఉండడంతో రైతుల ఆందోళన
- ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది



పెళ్లకూరు : కప్పగుంటకండ్రిగ వద్ద స్వర్ణముఖి ప్రవాహం



పెళ్లకూరు : కలవకూరు చెక్‌డ్యామ్ వద్ద స్వర్ణముఖినది వరద ఉధృతి



దొరవారిసత్రం : కుప్పారెడ్డిపాళెం సమీపంలో బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న పాలకాలువ

వెంకటగిరిరూరల్/రాపూరు/నాయుడుపేట టౌన్/పెళ్లకూరు/దొరవారిసత్రం/డక్కిలి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల బుధవారం తెల్లవారుజామున నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. వెంకటగిరిలోని చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు చేరింది. దీంతో పనులకు ఆటంకం కలిగిందని నేత కార్మికులు చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. వెంకటగిరి మండలంలోని దాచెరువు, పాళెంకోట, సిద్ధవరం, జూమానికండ్రి, బసవాడి, పాలగొండసత్రం, లాలాపేట, కుర్జాగుంట, మన్నేగుంట, కుమ్మరిగుంట, అమ్మవారిపేట, పాపమాంబపురం, సింగమాంబపురం చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. మరో 30 చెరువుల్లోకి 75 శాతం, మరో 20 చెరువుల్లోకి 50శాతం నీరు చేరినట్టు అధికారులు తెలిపారు. రాపూరు మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- నాయుడుపేట పట్టణంలోని రాజుగోపాలపురం, చిన్నదర్గా వీధి, రావువారి వీధి, గరీడీ వీధి, బజారు వీధుల్లో నీరు నిలిచింది. అయ్యప్పరెడ్డిపాళెం, పండ్లూరు రైల్వే అండర్ బ్రిడ్జిల్లో భారీగా నీరు నిలవడంతో రాకపోకలు ఆగిపోయాయి. స్వర్ణముఖి నది ప్రవాహం ఉధృతంగా ఉంది. అధికారులు నదీ పరివాహక ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.
- పెళ్లకూరు మండలంలో బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి స్వర్ణముఖి నదిలో వరద ఉధృతి పెరిగింది. చిల్లకూరు, చెంబేడు, పునబాక, పాలచ్చూరు చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. కట్టలు బలహీనంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపైర్లు నీట మునిగాయి.
- దొరవారిసత్రం మండలంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. నెర్రికాలువ, పాలకాలువ, కన్నాకాలువ మళ్లీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కుప్పారెడ్డిపాళెం సమీపంలో బ్రిడ్జి మీదుగా పాలకాలువ వరద నీరు వెళుతోంది. దొరవారిసత్రం, అక్కరపాక, మినమనముడి, మేలుపాక, పోలిరెడ్డిపాళెం గ్రామ సమీపంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు మునిగిపోయాయి. కట్టువాపల్లి, మానేరి, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, పూలతోట, పాళెంపాడు, నెల్లూరుపల్లి తదితర గ్రామాలోని చెరువులు నిండాయి. కట్టలు బలహీనంగా ఉండడంతో గండ్లు పడతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- డక్కిలి మండలంలో బుధవారం కూడా వర్షం కురిసింది. చెరువుల్లోకి నీరు చేరింది.